విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 30, ఏప్రిల్ 2024

అనంత డంపింగ్ యార్డు తరలింపే మా లక్ష్యం

- అవినీతి అనంత వెంకట్రామిరెడ్డిని గద్దె దింపాలి

- సీపీఐ అనంత అర్బన్ అభ్యర్థి సీ జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: గత ఐదు సంవత్సరాలుగా ప్రజల సమస్యల పట్ల ఏరోజు అసెంబ్లీలో నోరు మెదపని వ్యక్తి వైకాపా అనంత అర్బన్ అభ్యర్థి అనంత వెంకట్రామిరెడ్డి అని సిపిఐ అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి సీ.జాఫర్ పేర్కొన్నారు. సోమవారం సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమా నగర్, తదితర ప్రాంతాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాఫర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను తీర్చడానికి అసెంబ్లీలో అనంత వెంకట్రామిరెడ్డి చర్చించిన పాపాన పోలేదన్నారు. నిత్యం సీపీఐ పార్టీ ప్రజల పక్షపాతి అన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలిప్పించిన ఘనత ఒక్క సీపీఐ పార్టీకే ఉందన్నారు. పీఏబీఆర్ టీఎంసీ నీళ్ల కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేశామన్నారు. మెడికల్ కళాశాల రావడానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో అప్పట్లో ఉద్యమం చేసి సాధించుకున్నామన్నారు. గతంలో వైకాపా అధికారంలో రాగానే మూడు నెలల్లోనే డంపింగ్ యార్డ్‌ను మారుస్తామని అనంత వెంకట్రామిరెడ్డి చెప్పారని, వైకాపా ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఎరువుగా మారుస్తామంటూ ఒకసారి టెండర్ 28 కోట్లు, మరోసారి 8 కోట్లు టెండర్‌కి పిలిచి ఎరువుగా మారుస్తామంటూనే కాంట్రాక్టర్ ఎమ్మెల్యే లోపాయికారి ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. అనంతలో పచ్చదనం కోసం ఒక మొక్కను రూ.10 వేలుగా మార్చుకొని అవినీతికి పాల్పడ్డారన్నారు. కుక్కల పేరుపై రూ.3 కోట్ల అవినీతి జరిగిందన్నారు. అవినీతి అనంతను గద్దెదింపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాభివృద్ధి కోసం ముందుకు వస్తున్న సీపీఐ కంకి కొడవలి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వి.మల్లికార్జున హస్తం గుర్తుకు ఓటు వేసి బలపరచాలన్నారు. సీపీఐ పార్టీ అధికారంలోకి వస్తే డబ్బింగ్ యాడ్‌ను ముద్దుల పురంకు మారుస్తామన్నారు. పురాతనజడ్జి బంగ్లాను అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తామన్నారు. సీపీఐ జిల్లా సహాయకారదర్శి పి.నారాయణ స్వామి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జే.రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సీపీఐనగర్ కార్యదర్శి శ్రీరాములు, బి.కేశవరెడ్డి, సి.లింగమయ్య, పి.రామ కృష్ణ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి బి.రమణ జి.సంతోష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, రాజేష్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, నాగరాజు.. సీపీఐ నగర సహాయ కార్యదర్శి అల్లిపీర నగర కార్యవర్గ సభ్యులు ఎలుట్ల నారాయణస్వామి, రజాక్, చందు బాషా, గాదిలింగప్ప వి.కె.కృష్ణుడు, సుందర్ రాజు, మున్నా, రాజు కాంగ్రెస్ నాయకులు హేమలత, పృథ్వి పాల్గొన్నారు.

కాంగ్రెస్, వామపక్ష పార్టీల కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మల్లికార్జున, మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ : త్వరలో జరగ నున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న టిడిపి, వైసిపి పార్టీలను ఓడించి రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ వామపక్ష కూటమి అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి వజ్జల మల్లికార్జున (పాలమల్లి) ఉరవకొండ నియోజకవర్గం అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉరవకొండలో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు ఆగిపోయిన హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులను కూడా పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీటిని అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మిరప పంట సాగు చేసిన రైతులు ధరలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గిట్టుబాటు ధర కల్పించే విధంగా పోరాటం చేస్తానన్నారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలు తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని తెలిపారు. విభజన తర్వాత రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హెూదాతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూడా ఆగిపోయింది అన్నారు. వీటిని సాధించ డంలో పది సంవత్సరాల పరిపాల నలో ఉన్న తెలుగు దేశం, వైసీపీ రెండు కూడా విఫలం చెందైన్నారు. తాము కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విభజన హామీలతో పాటు ప్రతి మహిళకు లక్ష రూపాయల నగదు, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలు ప్రతి సంవత్సరం 2.20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, 4 వేల రూపాయల పింఛన్లు, వికలాంగులకు 6వేలు అందివ్వడం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటు న్నారని రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర పెద్దఎత్తున విజయవంతమైన అన్నారు. అనంతరం ఉరవకొండ పట్టణంలో ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వడదెబ్బతో ఉపాధి కూలి మృతి.

విశాలాంధ్ర-కూడేరు: కూడేరు మండలం కదదరకుంట గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి చెందిన ఉపాధి కూలి బెల్డోన ఓబుళపతి వడదెబ్బతో మృతి చెందాడు. సోమవారం ఉపాధి పనికి వెళ్లొచ్చి వాంతులు వీరేచనలతో నానా ఇబ్బందులు పడుతుంటే కుటుంబ సభ్యులు వెంటనే కూడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వెలుడోనా ఓబులపతికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని, అతని మరణంతో కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో ఉందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి రూ.20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా, పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని వీహెచ్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న డిమాండ్ చేశారు.

12 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-కణేకల్లు: మండలంలోని గోపులాపురం గ్రామానికి చెందిన 12 వైసీపీ కుటుంబాలు సోమవారం మాజీ మంత్రి, రాయదుర్గం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నివాసంలో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తల 12 కుటుంబాలు టీడీపీలో చేరారు. అనంతరం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తమ నివాసంలో వారికి పార్టీ కండువాలు వేశారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు బసవరాజ్, ఆదినారాయణ, ప్రభాకర్‌రెడ్డి, నగేష్, కేసన్న, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం కలెక్టరేట్లో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) నిర్వహించారు. పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి అభ్యర్థులు ఎవరూ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. అనంతపురం పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి మరియు అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఛాంబర్ లో అభ్యర్థులకు గుర్తులు కేటాయించే కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, పార్లమెంటరీ నియోజకవర్గం ఏఆర్ఓ రమేష్ రెడ్డి, అభ్యర్థులు పాల్గొన్నారు.

శింగనమలలో ఇద్దరు విత్‌డ్రా

విశాలాంధ్ర-శింగనమల: నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థులు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు, నియోజక వర్గానికి సంబంధించి మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా అందులో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు నిర్దేశిత గడువులో ఉపసంహరించుకున్నారు, 14 మంది అభ్యర్థులు బరిలోనిలిచారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను, తెలిపారు. కార్యక్రమంలో శింగనమల తహసిల్దార్ శోభన్ బాబు, ఎల్లనూరు, పుట్లూరు నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, మండలాల తహసిల్దార్లు ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ రామ కృష్ణ, ఎన్నికల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి ప్రజాబలమే అండ...

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటు వేయండి

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

విశాలాంధ్ర-శింగనమల: ప్రతి కుటుంబానికి ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు అందించి జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని మళ్ళీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం వీరాంజనేయులు అన్నారు. బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి ఎస్సీ కాలనీ, కొర్రపాడు, నీలారెడ్డిపల్లి, చెన్నంపల్లి, గ్రామాలలో మన ఊరికి మన వీరా కార్యక్రమంలో భాగంగా గడపగడపకు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు, ఇంటింటికీ తిరుగుతూ ఐదేళ్లలో జగనన్న చేసిన సంక్షేమాన్ని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

అనంతరం వీరాంజనేయులు మాట్లాడుతూ. జగనన్న జనం మెచ్చిన నాయకుడని, మళ్లీ ఆశీర్వదించి, గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు వస్తాయని, పనిచేసే ప్రభుత్వానికి మద్దతు పలకా లన్నారు. టిడిపి నాయకుల మాయమాటలు విని మోసపోవద్దని సూచించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవమంటూ రాష్ట్రానికి ఏమి చేయలేదని విమర్శించారు, బాబు వస్తే జాబు వస్తుందన్న చంద్రబాబు మాయ మాటలు విని గెలిపించిన తర్వాత నిరుద్యోగ సమస్య అధికమైందన్నారు, చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు దాదాగిరి చేస్తాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు, చంద్రబాబు నాయుడు ఎన్ని మోసపూరిత వాగ్దానాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు, చంద్రబాబు వస్తే ప్రభుత్వ పథకాలు నామరూపాల్లేకుండా పోతాయని, పిల్లల భవిష్యత్ అగమ్య గోచరం గా మారుతుందని వివరించారు. అదే జగనన్న అధికారం లోకి వస్తే ప్రభుత్వ పథకాలు పార్టీలకతీతంగా మన ఇంటిని వెతు క్కుంటూ వస్తాయని గుర్తు చేశారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడని ప్రజలు నమ్ముతున్నారన్నారు. అదే చంద్రబాబు నాయుడు చేయడు అనే విషయం రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలుసున్నారు. జగనన్న తీసుకొచ్చిన మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని నెరవేస్తారన్నారు, జగనన్న చేసేదే చెబుతాడని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను అత్యధికమెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తేప్రజలందరికీ అందుబాటులో ఉంటూ నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఒంటి కాలుపై నిరసన

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో తీవ్రమైన తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ 11వ వార్డుకు చెందిన శివ అనే వ్యక్తి సోమవారం స్థానిక ఆర్డబ్ల్యు ఎస్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలు మెడలో వేసుకుని ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. శివ మాట్లాడుతూ పట్టణంలో 15 రోజులకు ఒకసారి కూడా తాగు నీటిని సరఫరా చేయడం లేదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉరవకొండ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎంపీగా గెలిపించండి.. మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా...

విశాలాంధ్ర-రాప్తాడు : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే రాప్తాడు మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హిందూపురం పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. ఆత్మీయ కలయికలో భాగంగా సోమవారం రాప్తాడులో పర్యటించారు. రాప్తాడు వాల్మీకులు, ఇతర సామాజిక వర్గం తనకు మద్దతు పలకాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చి రాప్తాడు మండలానికి అధికంగా కేటాయిస్తామన్నారు హిందూపురం ఎంపీ అభ్యర్థిగా 28 ఏళ్ల అనంతరం ఒక బోయ సామాజిక వర్గానికి సీఎం జగన్ వైసీపీ ఎంపీ అభ్యర్థిగా కేటాయించడం హర్షనీయమన్నారు. దీనిపై వాల్మీకులు కూడా చాలా సంతోషంగా ఉన్నారని, కులమతాలు, పార్టీలకతీతంగా జగనన్న సంక్షేమ బాటలో ఆయన తెచ్చిన సంక్షేమం బడుగు, బలహీన వర్గాలకు అందిందని అందులో భాగంగా తాను కూడా ఓటు అడుగుతున్నానని ప్రతిఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని, ఎంపీగా తనకు ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఆగ్రోస్ కేశవరెడ్డి, లాయర్ వాల్మీకి హరి, వేపకుంట రామలింగయ్య, కార్యక్రమంలో మాస్లుకోసే రాము, రాజశేఖర్, ఎల్ఐసి వెంకటరాముడు, మారుతి, రేనాటి శ్రీనివాస్, జింకల రామాంజనేయులు, వాల్మీకి దనుంజయ, తలారి నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సారథి జగనే ...

- ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి

ప్రచారం నిర్వహిస్తున్న విశ్వేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొన సాగాలంటే మరోసారి ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి కావా ల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసీపీ ఉరవకొండ నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వే శ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండ పట్టణంలో 5,6 వార్డుల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ సీఎం జగన్ హయాంలో వైసీపీ ప్రభు త్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అంతకు ముందు వైస్సార్సీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ప్రచార రథం పై రోడ్ షో నిర్వహించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి హయాంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, సర్పంచ్ లలిత, ఉప సర్పంచ్ వన్నప పాల్గొన్నారు.

రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసే వారు..

విశాలాంధ్ర-రాప్తాడు : వచ్చే నెల 13వ తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాప్తాడు నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు వేశారు. 26వ తేదీన స్క్రూటీని జరగగా 29వ తేదీన ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. 13 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వం ఖరారు కాగా ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు సోమవారం సాయంత్రం తెలిపారు అనంతరం పోటీలో ఉండే అసెంబ్లీ అభ్యర్థుల వివరాలను వెల్లడించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన ఆదిఆంధ్ర శంకరయ్యకు హస్తం గుర్తు, అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటకు చెందిన ఎం. అంజయ్యకు బీఎస్పీ తరపున ఏనుగు గుర్తు, ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి వైసీపీ తరపున ఫ్యాన్ గుర్తు, రామగిరి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ మంత్రి పరిటాల సునీతకు టిడిపి తరపున సైకిల్ గుర్తు కేటాయించారు. కూడేరు మండలం జయపురం గ్రామానికి చెందిన కురుబ ఎస్. మల్లికార్జునకు ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ తరపున విజిల్ గుర్తు, జై భీమ్ రావు భారత్ పార్టీ తరపున కె.నరేష్ కు కోటు గుర్తు, కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన బి.నరేశ్ గ్యాస్ టంబ్లర్ గుర్తు, కనగానపల్లి మండలం మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి కానగాల విజయ్ కుమార్ కు లోలకం గుర్తు, రాప్తాడు మండల కేంద్రానికి చెందిన మాండ్లకోసే రామాంజికి జావెలిన్ కర్ర గుర్తు, ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఈ. రవివర్మకు రూమ్ కూలర్ గుర్తు, రాప్తాడు మండలం ఎం బండమీద పల్లి గ్రామానికి చెందిన వై రాజశేఖర్‌కు కెమెరా గుర్తు, గంగలకుంట గ్రామానికి చెందిన సి. వెంకట రామునికి ఎయిర్ కండిషనర్ గుర్తు, కనగానపల్లి మండలం రాంపురం గ్రామానికి చెందిన సాకే రాజేష్ కుమార్ కు కరెంటు స్విచ్ బోర్డును కేటాయించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు తెలిపారు. కాగా ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్ వేసిన పోతుల నాగరాజు, ఏ.రఘురామయ్య తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

డాక్టర్ పద్మావతి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కంటి వైద్య విభాగం ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ సి.జి.పద్మావతి పదవీ విరమణ మహోత్సవాన్ని సోమవారం వైద్య కళాశాలలోని సుశ్రుత హాల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్ ఆచార్య డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అనంతపురం శాఖ అధ్యక్షులు ఆచార్య డాక్టర్ రామస్వామి నాయక్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ డాక్టర్ పద్మావతి వైద్య విభాగం అభివృద్ధిలో తన పాత్ర అనంతమైనదని తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వృత్తి ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వహించిన అతి కొద్ది మందిలో అగ్రగణ్యులు డాక్టర్ సిజి పద్మావతి అని, అనేక కంటి శస్త్ర చికిత్సలను 30 సంవత్సరాలకు పైగా ఎంతోమందికి నేత్ర దానాన్ని ప్రసాదించారని తెలిపారు. ఏపీ జిడిఏ ప్రెసిడెంట్ ఆచార్య డాక్టర్ రామస్వామి నాయక్ మాట్లాడుతూ ఈరోజు ఆప్తల్మాలజీ డిపార్ట్మెంట్ ఇంత అభివృద్ధి పథంలో పయనిస్తుంది అంటే అందులో డాక్టర్ పద్మావతి మేడం కృషి ఎంతో ఉందని తెలిపారు. ఏపీ జీడీఏ ఆధ్వర్యంలో వివిధ డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో పద్మావతిని శాలువా పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో సన్మానించారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ భగవంతుడు ప్రసాదించిన వైద్య వృత్తిని అంతఃకరణ శుద్ధితో నిర్వహించానని, తనకు తోడ్పాటు అందించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ, కాంగ్రెస్‌లకు ఊహించని షాక్..

విశాలాంధ్ర-పరిగి: స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండలంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు ఊహించని పెద్ద దెబ్బ తగిలింది. వివరాల్లోకెళ్తే సిరేకొలం పంచాయతీ మాజీ సర్పంచ్ ధనాపురం రామకృష్ణ, మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సివిఎన్ నర్సింహులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు నయాజ్, నంజుండప్ప, ఆంజనేయులు, కిష్టప్ప మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక ఇదే రోజు మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లి, మోద పంచాయతీలకు చెందిన తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలు కుటుంబాలు మంత్రి చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామంతో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికలవేళ ఊహించని షాక్ తగిలినట్లుంది. మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జోరుగా టీడీపీ ఎన్నికల ప్రచారం...

ఓటేయాలని అభ్యర్థిస్తున్న ధీరజ్‌రెడ్డి...

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో తాడిపత్రి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి మేనల్లుడు ధీరజ్ రెడ్డి మండల నాయకులతో కలిసి సోమవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. అదే విధంగా యాడికిలో లాలెప్ప వీధి, దుర్గమ్మ వీధి పలు వీధులలో జనసేన మండల కన్వీనర్ సునీల్, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ ఆది నారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. ఈ పథకాల వల్ల పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక మహిళలకు క్లుప్తంగా వివరించారు, కావున వచ్చే ఎన్నికలలో తాడిపత్రి తెలుగుదేశంఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు నీలకంఠ, మైనార్టీ అధ్యక్షుడు శుభహాన్ సెల్ పాయింట్ చాంద్ భాషా, కరెంటు రహమతుల్లా, రామచంద్ర, జనసేన మధు ఆచారి, బాబు, మల్లికార్జున, ఒబయ్య, వడ్డే పరమేశ్, సాయిరాం,జాకీర్ మాయ కుంట్ల నారాయణస్వామీ, విశ్వం పాల్గొన్నారు.

మెగా సప్లమెంటరీ పరీక్ష

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: ఎస్కేయూ యూజీ విద్యార్థులు మూడు సంవత్సరాల డిగ్రీ చదివి సకాలంలో పూర్తిచేయని విద్యార్థులకు మెగా సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీలో పరీక్ష విభాగపు సంచాలకులు ఆచార్య జివి రమణా, అధ్యక్షుడిగా కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సిడి, సిడిఎం సభ్యులు ఉన్నారు. కమిటీ సభ్యులు అధ్యయనం చేసిన నివేదికను వీసీకి నివేదించారు. త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. వార్షిక పరీక్షలు 1994- 95 నుండి 2014- 15, 2015-16,2018-20 సీబీఎస్ఈ సెమిస్టర్ విధానంలో వ్రాసే వారికి అరుదైన సువర్ణ అవకాశం కల్పించనున్నట్లు పరీక్ష విభాగాధిపతి ఆచార్య జీవి రమణ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని విజయ శిఖరాలను అధిరోహించాలి..

బాల్య వివాహాలు సమాజానికి అనర్ధదాయకం

- తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా చూడొద్దు

-ఐసీడీఎస్ పీడీ బిఎన్ శ్రీదేవి

విశాలాంధ్ర- రాప్తాడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అవి వారి జీవితాలను నాశనం చేయవద్దని సమాజానికి అనర్థమని ఐసిడిఎస్ పీడీ ఎస్.శ్రీదేవి శ్రీదేవి అన్నారు. సోమవారం సాయంత్రం రాప్తాడు అంగన్వాడి కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు ఆమె మాట్లాడుతూ పేదరికం ఇతర ఇబ్బందులతో తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా చూడొద్దు అన్నారు బాల్య వివాహాల నిర్మూలనను అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు అమ్మాయిలకు 18 ఏళ్లలోపు, అబ్బాయిలకు 21 ఏళ్లలోపు వివాహాలు చేయరాదన్నారు అలా చేసినవారికి రూ. లక్ష జరిమానా తో పాటు రెండేళ్ళ జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

అదేవిధంగా అంగన్వాడీలకు వచ్చే చిన్నారులను ఆప్యాయంగా చూసుకోవాలన్నారు చిన్నారుల జీవితంలో మొదటి ఆర్యలు ఎంతో విలువైన వని మూడేళ్ల వరకు తల్లి ఒడికి పరిమితం అయ్యే పిల్లలు తర్వాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెడతారన్నారు ఈ వయసులో చూపిన విన్న అంశాల ఆధారంగా చిన్నారులు తమ బుద్ధిని తెలివి తేటలను వికసింప చేసుకుంటారన్నారు. గర్భవతులు, బాలింతలు ఐదేళ్ల చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగరత్న, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే కురబలకు పెద్దపీట

విశాలాంధ్ర-బొమ్మనహాల్ :

తెలుగుదేశం హయాంలో కురబలకు పెద్దపీట వేశారని కురబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ కె మల్లీకార్జున, మాజీ డైరెక్టర్ నాగరాజులు అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కురుబ కులస్తులకు చంద్రబాబు నాయుడు అన్ని రకాలుగా అవకాశం కల్పించారని అలాంటి వ్యక్తికి కురుబ కులస్తులు అండగా ఉంటామన్నారు. నేడు మంగళవారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో కురబ కులస్తుల ఆత్మీయ సమ్మేళన సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయకులు శివ, మల్లన్న, దిలీప్, లేపాక్షి, ఈశ్వర్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం జిల్లా నుండి హజ్ యాత్రకు బయలుదేరుతున్న 216 మందికి మే 2 న ఉదయం 8-30 గంటల నుండి అనంతపురంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈ బి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్.యుగంధర్ మాట్లాడుతూ హజ్ యాత్రకు బయలు దేరు 216 మంది కూడా తప్పనిసరిగా క్యూఎంఎంవి, ఎస్ఐవి వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని కోరారు. 216 మంది యాత్రికుల వ్యాక్సినేషన్ కార్యక్రమ ఏర్పాటుకు సహకరిస్తున్న జిల్లా వైద్య అధికారులకు హజ్ జిల్లా కమిటీ కన్వీనర్ ముస్తాక్ అహ్మద్ బాకవి ,ఎంఏ మునీర్ భాష, జాఫర్ మొహిద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

138వ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లావ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ 1886 సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం 8 గంటల పనిదినం కోసం పెద్దఎత్తున పోరాటం చేసి 8 గంటల పనిదినం సాధించిన రోజే మేడే అన్నారు. 138 సంవత్సరాలుగా సాధించుకున్న హక్కులు ఈ పది సంవత్సరాలలో కనుమరుగయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, దీన్ని తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కష్టాలు, బాధలు, వేతన సమస్య, కనీస వేతనం సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ కార్మికులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. దుకాణాల్లో 12 నుంచి 15 గంటలు పని చేస్తున్నారన్నా గత, ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల కాలంలో మేడేని పెద్దఎత్తున నిర్వహించాలని సిపిఐ పిలుపునిస్తుం దన్నారు. మండల, పట్టణ ప్రాంతాలలో రంగాల, సంఘాల నాయకులు పాల్గొనాలని మే డేను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ ఎన్నికల యుద్ధం వైసీపీకి, టీడీపీ, జనసేనకి మధ్య కాదు. భారత జనతా పార్టీకి ప్రజలకూ మధ్య జరిగే యుద్ధమని. గత పదేళ్లుగా ఈ రాష్ట్రాన్ని పాలించిన ఈ పార్టీలు విభజన చట్టం లోని హామీలను అమలు చేయించుకోడానికి విశాఖ ఉక్కు ప్రైవేటు పరం కాకుండా ఆపడానికి నిరుద్యోగుల సమస్యలు కోసం కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఏనాడూ నిలదీయలేదన్నారు. జిల్లాలో కార్మికుల ఓట్లు కోసం పాలకులు ప్రాకులాడుతున్నారని, ఏనాడు కార్మికు హక్కులు, వారి సమస్యలు పట్టించుకుని వారికి ఓటు అనే ఆయుధంతో సరైన గుణపాఠం చెప్పాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్మిక దినోత్సవాన్ని మండల కార్యదర్శులు, ఏఐటీయూసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు వాడవాడలా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.

మడకశిరను మరింత అభివృద్ధి చేసుకుందాం

సీడబ్ల్యూసీ సభ్యులు నీలకంఠాపురం రఘువీరారెడ్డి

విశాలాంధ్ర-గుడిబండ : మడకశిర నియోజకవర్గం గత పది సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఆ తర్వాత అధికారంలో ఉన్న టీడీపీ, వైసీపీ అభివృద్ధిని విస్మరించాయని సిడబ్ల్యుసి సభ్యులు డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో గుడిబండ ఉమ్మడి పంచాయతీలోని ఫలారం, పి.పాళ్యం, హెచ్ఆర్ హట్టి,పి. గొల్లహట్టి దేవరహట్టి, గుడ్డదహళ్లి, జి.ఎస్.తాండా మోపురగుండు, దేవరహట్టి, కె.జి.ఎన్.పాళ్యం, ఎస్.ఆర్.హట్టి, గుడిబండ మండల కేంద్రంలలో సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో జరిగిన అభివృద్ధి తప్పితే ఈ పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కరికెర సుధాకరును గెలిపిస్తే మడకశిర నియోజవర్గంలో రైల్వే లైన్ ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, పరిశ్రమలు స్థాపించడం శ్రీరాం రెడ్డి తాగునీటిని ప్రతి ఇంటికీ అందించడం కృష్ణమ్మ జలాలను నియోజకవర్గంలోని 320 చెరువులకు నీళ్లు నింపుతామన్నారు. మడకశిర నియోజకవర్గంలో మరింత సర్వతో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటేయాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయిన వెంటనే ప్రతి నిరుపేద కుటుంబంలోని మహిళకు రూ.8333లు ప్రతినెలా బ్యాంక్ ఖాతాలోకి జమ, పింఛన్ దారులకు రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచడం వికలాంగులకు రూ.6 వేల పింఛన్, నిరుద్యోగ యువత యువకులకు సంవత్సరానికి లక్ష రూపాయలు అందిస్తామన్నారు. మండలపల్లి సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, గుడిబండ ఉపసర్పంచ్ సన్న లింగమ్మ కుమా రుడు శివకుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ లోకేష్, పూజారి సురేష్, కె.బజ్జప్ప, ఎర్రబప్పగారి మాలింగప్ప, కదురప్ప రాజప్ప తిమ్మరాయప్ప గౌడ, కదరప్పలు వైసీపీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి రఘువీరారెడ్డి, సుధాకర్ సమక్షంలో కాంగ్రెస్ లోకి చేరారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు భుదిపల్లి నాగభూషణ్,రుద్రముని స్వామి,మాజీ ఎంపీపీ ఎల్కే నరసింహప్ప, మాజీ ఎంపీటీసీ శశిధర్, యశోద్ కుమార్, లక్ష్మీకాంత్, నాయజ్, యూత్ ప్రెసిడెంట్ రంగస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయటం తగదు

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: అడంగల్, వన్ బి పేరిట వివిధ కారణాలతో రైతులను రెవెన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురించేస్తున్నారని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... గత 10 రోజుల నుంచి రైతులు 1బి అడంగల్ లాక్‌లో ఉంటే వాటిని తొలంగించాలని తహసీల్దారుకు అర్జీలు సమర్పించి 10 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు తహసీల్దార్ ఏ మాత్రం పట్టించు కోకుండా రైతులను తిప్పుకుంటూ రైతులును ఇబ్బందులకు గురించేస్తుందని, ఏలక్షన్ డ్యూటీ మీద ఉన్నాము, ఏపనులు చేయమనే పద్ధతులలో వ్యవహారిస్తుందని తహసీల్దార్ తీరు మార్చుకోవాలని లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కలెక్టర్ కూడా పిర్యాదు చేస్తామని హెంచరించారు.

డైట్ సెట్ ఎంట్రెన్స్‌కు దరఖాస్తులు చేసుకోండి..

విశాలాంధ్ర-కొత్తచెరువు: డైట్ సెట్ 2024 ఎంట్రన్స్ కి ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి మీనాక్షి, తెలిపారు. ఈ కోర్సు రెండు సంవత్సరాలు ఉంటుందని అర్హులైన విద్యార్థులు ఈ దరఖాస్తులను మే 9వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి

వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి

విశాలాంధ్ర-పెనుకొండ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి అధ్యక్షతన రెవెన్యూ డివిజన్ అధికారి అపూర్వ భరత్‌కు సోమవారం సోమందపల్లి మండలం సర్వేనెంబర్ 700లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలు కలసి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. బాలస్వామి మాట్లాడుతూ గత మూడు నెలల నుండి సోమందపల్లి సర్వేనెంబర్ 700 దాదాపు 150 కుటుంబాలు గుడిసెలు వేసుకుని అక్కడే ఉంటా వార్పు చేసుకుని తింటూ చీకటిలో మట్టి దీపాలు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారని, ఇల్లు లేని నిరుపేదలంతా గత 2010 నుండి అధికారులకు ఎన్నో అర్జీలు పెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. సబ్ కలెక్టర్ వారు ఇల్లు లేని నిరుపేదలకు వారు గుడిసెలు వేసుకున్న సర్వే నెంబర్ 700లోనే పట్టాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఇళ్లస్థలాల భూసాధన కమిటీ అధ్యక్షురాలు నూర్జహాన్, ఉపాధ్యక్షురాలు భారతి, వెంకట లక్ష్మమ్మ, అంజనమ్మ, అయిషా, యశోదమ్మ ఎం.అంజనమ్మ రజియా సుబ్బమ్మ నూరి ఖాన్ శాదాబి, చౌడమ్మ సునీత అలివేలమ్మ, దుర్గాదేవి, వరలక్ష్మి ఓబులేసు జగదీష్ ఆంజనేయులు రాజేశ్వరి అమానుల్లా పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర ప్రజలకు మేలు

విశాలాంధ్ర-కొత్తచెరువు : రాబోయే ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ప్రజలు తనను గెలిపించాలని పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఇరగలపల్లి పంచాయతీలోనే తిప్పాబట్లపల్లి గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు.. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేస్తామన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసుకు చెందారన్నారు. పేద మధ్యతరగతి ప్రజలపై ప్రభుత్వం అధిక బారాలు మోపడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశానికి ఓటు వేసి గెలిపించాలన్నారు.

కదిరి తాలూకా సమగ్రాభివృద్ధే లక్ష్యం....

- అందరినీ కలుపుకుపోతా
- అద్భుత విజయం సాధిస్తా
- మేనిఫెస్టోను ప్రతి గుమ్మం వద్దకు తీసుకెళ్తా
- టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్

విశాలాంధ్ర-కదిరి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్నింట్లో వెనుకబడ్డ కదిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం నల్లచెరువు మండలానికి చెందిన రాట్నాలపల్లి, కమ్మారి వాండ్లపల్లి,యనమలవారి పల్లి, పులిమివారి పల్లి గ్రామాలకు చెందిన 100మంది వైసీపీ నాయకులు తెదేపా కార్యాలయంలో వీరికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని, పార్టీ నాయకులందరినీ కలుపుకు పోతానని తద్వారా త్వరలో జరగబోయే ఎన్నికల్లో అద్భుత విజయం సాధిస్తానని కందికుంట ధీమా వ్యక్తం చేశారు.నియోజకవర్గంలోని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తోడు నీడై ఉంటానని పేర్కొన్నారు. కదిరి ప్రాంతం అనాదిగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, ఎన్నికల్లో తాను విజయం సాధిం చడం ద్వారా తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి, రవాణా రంగాలను ప్రజల ముంగిటకు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు ప్రజలు తనను ఆదరించాలని, తద్వారా వారికి ఎప్పటికీ అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికలకు కేవలం 10రోజుల సమయం ఉందని ప్రత్యర్థి పార్టీకి చిన్న అవకాశం ఇవ్వొద్దని, గ్రామ గ్రామాన, ప్రతి ఇంటి గడపకు వెళ్లి పార్టీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలను వివరిద్దామని దిశా నిర్దేశం చేశారు. నియోజక వర్గానికి ఎంతో చేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి నాయకుడిని కలుపుకు పోతానని, అందరి సహకారంతో అఖండ విజయం సాధిస్తానని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైకాపా పాలన

ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్ మక్బూల్

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మక్బూల్, వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-కదిరి: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన కొనసాగుతోందని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్ మక్బూల్ పేర్కొన్నారు. సోమవారం కదిరి మున్సిపల్ పరిధిలోని 35 వార్డు, మండల పరిధిలోని మొటుకు పల్లి, కౌలేపల్లి గ్రామాలలోని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలు గురించి టీడీపీ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయని ప్రజలే నవ్వుకుంటున్నారన్నారు. రాజకీయాలలో రౌడీయిజం చేయాలని చూస్తున్న టీడీపీ. జనసేన నాయకులు అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేస్తామని చెప్పకపోగా వైసీపీ నాయకులు అంతు చూస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక మేనిఫెస్టోని మాయం చేసిన ఘనుడు మీ చంద్రబాబు అయితే మాట తప్పితే ఓటు వేయద్దని చెప్పిన దమ్మున్న నాయకుడు మా జగనన్న. అన్నారు. తప్పుడు హామీలు, అబద్దపు మాటలు చెప్పి అడ్డదారుల్లో అధికారం చేపట్టాలని చూస్తున్న కూటమి సభ్యులకు ప్రజలే బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు.ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, మున్సిపల్ చైర్మన్ పరికి షాదిక్ భాషా, వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జ్ లింగాల లోకేశ్వర్ రెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ, పార్టీ యువ నాయకులు ప్రణీత్ రెడ్డి, జెడ్పీటసీ భూక్యా రాదాకృష్ణ నాయక్, కౌన్సిలర్ మురళి, జంపాల నాగేంద్ర, శీన, అశోక్ గిరిధర్, సర్పంచ్ రాము, ఎంపీటీసీ లోకేష్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగన్ మోహన్ రెడ్డి మేనిఫెస్టో ఓ వరం

బడుగు బలహీన వర్గాలకు అండదండ

ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

విశాలాంధ్ర - హిందూపురం : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విడు దల చేసిన ఎన్నికల మేనిఫెస్టో బడుగు బలహీన వర్గాలకు ఓ వరం అని, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం 2024 వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో రాష్ట్ర ముఖ్యమంత్రి విడుదల చేశారని, ఆ మేనిఫెస్టో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పింఛన్లను 3000 రూపాయలు నుండి 3500 లకుకు, రైతు భరోసా 13 వేల రూపాయలు నుండి 16 వేలకు పెంచడం ఇటు రైతులకు, అటు పింఛన్దారులకు ప్రయోజనం లభిస్తుందని అన్నారు. రైతులకు రుణమాఫీ విడుదల చేయడం లేదని ప్రతిపక్షాలు విమర్శించడం తగదని రుణమాఫీ చేయడానికి రూ 37 వేల కోట్లు అవసరం ఉందని, అంత భారీ బడ్జెట్ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాలకు ఆర్థిక భారం పడుతుందని గుర్తు చేశారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో టిడిపి విడుదల చేసిన మేనిఫెస్టో అమలు చేయలేక చేతులెత్తేసిన సంగతి గుర్తు చేశారు. ప్రజలకు చేయగల సంక్షేమ పథకాలు అమలు చేసే పథకాలు మాత్రం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పెట్టారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, కొందూరు వేణుగోపాల్‌రెడ్డి, కొటిపి హనుమంత్ రెడ్డి, హిందూపురం మండల ఉపాధ్యక్షులు రాచపల్లి రఘునాథ్‌రెడ్డి, 6 వ వార్డు మల్లికా భాను, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర డైరెక్టర్లు,మార్కెట్ యాడ్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్,వైస్ చైర్మన్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండల, టౌన్ కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, వార్డు ఇన్చార్జులు, వార్డు మెంబర్లు, కో ఆప్షన్ మెంబర్స్, సింగిల్ విండో అధ్యక్షుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ బోర్డు చైర్మన్లు అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర ప్రజలకు న్యాయం

ఎమ్మెల్యే అభ్యర్థి రంగన అశ్వర్థ నారాయణ

విశాలాంధ్ర-ధర్మవరం: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రంగాన అశ్వర్థ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా పట్టణంలోని గాంధీ నగర్ మెయిన్ బజార్, శ్రీదేవి థియేటర్ రోడ్డు వరకు గల ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా చిన్నా, పెద్ద వ్యాపారులకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను తెలుపుతూ, కర్ణాటక, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాయని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో కూడా కాంగ్రెస్ పార్టీకు రాష్ట్ర ప్రజలు ఆశీస్సులు తప్పక అందజేస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను తప్పక అమలు చేసి తీరుతామని తెలిపారు. చేనేతకు జీఎస్టీని మినహాయింపు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సిఏఏ, ఎన్ఆర్ సి, ఎన్ పిఆర్, యుసిసి చట్టాలను రద్దు చేస్తామని తెలిపారు. రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు, రైతు పెట్టుబడి మీద 50 శాతము లాభంతో మద్దతు ధర, ఉపాధి హామీ కూలీకి రోజుకు కనీసం 400 రూపాయలు వేతనము, వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వబడుతుందని తెలిపారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, ఇల్లు లేని వారికి ఐదు లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం, ప్రత్యేక హెూదా 10 సంవత్సరాలు గ్యారంటీతో తదితర పథకాలను వెనువెంటనే అమలు చేస్తామని చేనేత వ్యాపారులు కార్మికుల సంక్షేమానికి చేనేత బ్యాంకు ఏర్పాటు చేస్తామని, పట్టు ముడి సరుకు కొనుగోలుకు 40 శాతం రాయితీ ఇస్తామని, చేనేత ప్రాంతాలలో ప్రభుత్వ సహకారంతో ముడి సరుకు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలలో మాదిరిగా ఆంధ్ర సిల్క్ బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని ఆత్మహత్యలు చేసుకున్న నేతలను తగిన ఆర్థిక సహాయంతో ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాహీర్, నారాయణస్వామి, మునఫ్, జాఫర్, కరీం, సాయి, శంకర్, రాజు, మన్సూర్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోండి..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పలు పెట్రోల్ బంకులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఉచిత సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ మంచినీటి వసతి అందుబాటులో ఉంటుందని, మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా ఉపయోగించుకోవచ్చునని, ప్రతి వాహనానికి టైర్‌లో గాలి ఉచితంగా నింపుకోవచ్చునని, ఫిర్యాదులు పెట్టే, ఫస్ట్ ఎయిడ్ కిట్లులను కూడా ఉపయోగించుకోవాలని, వినియోగదారులు పెట్రోలు డీజలు నాణ్యత తెలుసుకునేందుకు అక్కడ అనుకూలంగా ఉండే పరికరాలతో పరీక్షలు కూడా చేయించుకోవచ్చు అని తెలిపారు. పై వాటిలో ఏ సౌకర్యం లేకున్నా పెట్రోల్ బంక్ యజమానుల నిర్లక్ష్య సమాధానమిచ్చిన, చమురు మార్కెట్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

దివ్యాంగులను ఆదుకుంటాం

బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్...

విశాలాంధ్ర-ధర్మవరం : నియోజకవర్గంలోని దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జనసేన, టిడిపి, బిజెపి, ఉమ్మడి అభ్యర్థి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సిఎస్బి గార్డెన్స్‌లో నాలుగు మండలాల దివ్యాంగులకు ఏర్పాటుచేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రభుత్వం వైసీపీ పార్టీ వికలాంగులకు అన్యాయం చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులను వాడుకొని ప్రజలను కూడా మోసం చేసిన ఘనత వైసీపీకే దక్కిందని ఎద్దేవా చేశారు. బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులు అందరికీ రూ.6వేల పెన్షన్, మండలానికి ఒక ప్రత్యేక భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిసెంబర్ 3న తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా ధర్మవరం రైల్వే స్టేషన్‌లో దివ్యాంగుల రవాణా కోసం ఎలక్ట్రిక్ వాహనం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 16న నా జన్మదినం సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు 10 ఆటోలను కూడా ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు.

అభివృద్ధి చేసే పార్టీకే ఓటేయండి

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి...

విశాలాంధ్ర-ధర్మవరం: అభివృద్ధి చేసే పార్టీకే ప్రజలందరూ ఓటు వేయాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నేసే పేటలో ఇంటింటికి తిరుగుతూ, వైఎస్సార్సీపీ ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి, అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు చేనేతలకు తప్పుడు హామీలు ఇచ్చి మాట తప్పారని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేనేతలు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు ఆనాడు తాను జోలు పట్టి 65 మంది కుటుంబాలకు సహాయం చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా 650 రూపాయలు ఉన్న సబ్సిడీని ఏడాదికి 24 వేల రూపాయలు చొప్పున చేనేత లబ్ధిదారులకు నేరుగా జమ చేసిన ఏకైక పార్టీ వైసీపీ అని ఇది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఘనత అని తెలిపారు. మరోసారి వైసీపీ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. వైసీపీ నాయకులు, చేనేత వ్యాపారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తాం

బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సాకే వినయ్ కుమార్

ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న సాకే వినయ్ కుమార్

విశాలాంధ్ర- ధర్మవరం: అన్ని వర్గాల వారికి సమ న్యాయం చేస్తామని బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సాకే వినయ్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని తుంపర్తి గ్రామంలో పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ బీఎస్పీ పార్టీకి అవకాశం ఇస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తా నని తెలిపారు. అక్కడి గ్రామ ప్రజలు ఉపాధి లేదన్న సమాచారాన్ని తీసుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పక ఉపాధి కల్పించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బీఎస్పీ పార్టీ విద్య, వైద్యం, ఇల్లు లాంటి సంక్షేమ పథకాలను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. సాకే హరి కుమార్, సాకే విజయ్‌కుమార్, కిరణ్, అమర్నాథ్, సాకే అనిల్, తుంపర్తి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నాన్ లోకలైన సమితమ్మ లోకల్ గురించి మాట్లాడటం హాస్యాస్పదం - మంత్రి ఉషశ్రీ..

విశాలాంధ్ర-పెనుగొండ: నాన్ లోకలైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లోకల్ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని మంత్రి ఉషశ్రీ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ పెనుకొండలో సవితమ్మ ప్రభుత్వానికి ఇచ్చిన అఫిడిబిట్‌లో డాటర్ ఆఫ్ ఉందని, ఆమెపై ఎన్నో కేసులున్నాయని, పెనుకొండ ప్రజలు ఇది గమనించాలన్నారు. నేనూ గర్వంగా చెబుతున్న నా పేరూ ఉషశ్రీ, నా భర్త పేరు చరణ్ రెడ్డి, నేనూ అఫిడిబిట్‌లో అదే పొందురిచా.. నా పై రెండు కేసులు మాత్రమే ఉన్నాయి అని తెలిపారు. ఉషశ్రీపై ఆంధ్రాలోనే కాకుండ కర్నాటకలో కూడా కేసులూన్నాయని, ఫోర్జరీ, 420 కేసులు ఉన్న టీడీపీ అభ్యర్థి సవిత్మ అని ఎద్దేవా చేశారు. లోకల్ నాన్ లోకల్ అంటున్నావు మరి పవన్ కళ్యాణ్ లోకలా.. ? బాలకృష్ణ లోకలా..? అసలు నీవు నిజమైన లోకలా అంటూ మండిపడ్డారు. సవిత సమర్పిం చిన అఫిడవిట్‌లో ఉన్న అసత్యాలపై హైకోర్టును ఆశ్రయిస్తున్నానని, ధర్మవరం సత్యకుమార్ లోకలా నిన్న మొన్నటి వరకు రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను పేకాట మంత్రి అని బెంజ్ కార్ మంత్రి అని అవినీతి మంత్రుల పేరులో రెడ్ బుక్‌లో రాసుకున్నామని ఇప్పుడు మీ పార్టీలోకి వస్తే నిజాయితీ పరుడయ్యాడా అంటూ ప్రశ్నించారు.

ఎన్నికల బరిలో ఎమ్మెల్యే అభ్యర్థులు 15 మంది

విశాలాంధ్ర-ధర్మవరం : సార్వత్రిక ఎన్నికల బరిలో ధర్మవరం నియోజకవర్గంలో 15 మంది ఉన్నారని రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ సోమవారం నామినేషన్ ఉపసంహరణకు ఏ అభ్యర్థి కూడా రాలేదని, మొత్తం నామినేషన్లు 18 మంది వేయగా అందులో ముగ్గురు అభ్యర్థులను (అంబటి సతీష్, వీరనారాయణ స్వామి, గట్టు చైతన్య) తిరస్కరణ గావించబడిందని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో 15 మంది ఎమ్మెల్యే అభ్యర్థులలో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి-వైసీపీ సత్యకుమార్ యాదవ్-బీజేపీ, రంగన్న అశ్వత్థ నారాయణ-కాంగ్రెస్ పార్టీ, సాకే వినయ్‌కుమార్- బహుజన సమాజ్ పార్టీ, దారా శంకర్-జై భీమ్రావు భారత్ పార్టీ, షేక్ ఆయాజ్- నవతరం పార్టీ, ఇలియాజ్ అహ్మద్ సయ్యద్-స్వతంత్ర అభ్యర్థి, ఈశ్వర్‌రెడ్డి-స్వతంత్ర అభ్యర్థి, సూర్యనారా యణ- స్వతంత్ర అభ్యర్థి, దాసరి కవిత-స్వతంత్ర అభ్యర్థి, ధనుంజయ-స్వతంత్ర అభ్యర్థి, బిల్లి నరేంద్ర-స్వాతంత్రఅభ్యర్థి, బీరే సోమశేఖర్- స్వతంత్ర అభ్యర్థి, రవీంద్ర రెడ్డి-స్వతంత్ర అభ్యర్థి, డి.శ్రీనివాసులు నాయక్- స్వతంత్ర అభ్యర్థి కలరని తెలిపారు.

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో సెబ్ పోలీసులు దాడులు చేయగా, దివాకర్ అనే వ్యక్తి వద్ద నిల్వ ఉంచిన 480 టెట్రా కర్ణాటక ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి,స్టేషనుకు తరలించామని సెబ్ ఇన్‌స్పెక్టర్ గురు ప్రసాద్ తెలిపారు. ఈ టెట్రా ప్యాకెట్ల విలువ రూ.30 వేలు ఉంటుందన్నారు. ఎన్నికల దృష్ట్యా అక్రమంగా మద్యం, నాటు సారాయి కలిగివున్న లేదా అమ్మిన యెడల కఠిన చర్యలు తీసుకొనబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్స్పెక్టర్ రాజన్న, సిబ్బంది రమేష్ బాబు, శ్రీనివాసులు, జవహర్, కిరణ్ కుమార్, మల్లికార్జున, అరుణ, గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

ఆదిశక్తి పీఠం గ్రామదేవతల అర్చకులను ఆదుకోండి..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని చిన్నూరు రోడ్డులో గల చెరువు కట్ట వద్ద గల గ్రామదేవతల పూజారులను ఆదుకోవాలని కోరుతూ ఆదిశక్తి పీఠం గౌరవ సలహాదారు లక్ష్మీ వరప్రసాదుకు అర్చకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో భాగంగా చెరువు కట్ట వద్ద గల ఆలయంలో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామదేవతల పూజారుల సంఘం అధ్యక్షులు శివరాం మాట్లాడుతూ ప్రతి నెలా కనీసం రూ.5 వేల సంభావన ఇవ్వాలని, ధూప దీప నైవేద్యాలకు లేకుండా పూజారులు ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. తదుపరి గ్రామీణ సాంప్రదాయాలు, విద్యావ్యవస్థ, గ్రామ దేవత గొప్ప తనాన్ని గురించి తెలియజేశారు. అర్చకులలో చైతన్యం వచ్చే విధంగా వారి అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. పూజారుల సమస్యలు గూర్చి ప్రభుత్వానికి తెలియజేస్తా నని లక్ష్మీ వరప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు శేషు, రమణ, నటరాజ్, అనిల్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 30, ఏప్రిల్ 2024

టీడీపీ, కాంగ్రెస్‌లకు ఊహించని షాక్..

విశాలాంధ్ర-పరిగి: స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండలంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు ఊహించని పెద్ద దెబ్బ తగిలింది. వివరాల్లోకెళ్తే సిరేకొలం పంచాయతీ మాజీ సర్పంచ్ ధనాపురం రామకృష్ణ, మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సివిఎన్ నర్సింహులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు నయాజ్, నంజుండప్ప, అంజనేయులు, కిష్టప్ప మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక ఇదే రోజు మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లి, మోద పంచాయతీలకు చెందిన తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలు కుటుం బాలు మంత్రి చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామంతో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికలవేళ ఊహించని షాక్ తగిలినట్లుంది. మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ప్రచారం లేని లేపాక్షి రాజకీయం

- -మూటలిస్తేనే కాళ్లు కదులతాయా
- -అభ్యర్థుల తీరుపై నాయకుల్లో చర్చలు
- - ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



విశాలాంధ్ర-లేపాక్షి : రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వేడి మండుతుంటే లేపాక్షిలో మాత్రం ఓటు కాదుకదా.. మాట ప్రచారం కూడా కరువైంది. అయితే మూటలిస్తేనే కాళ్లు కదులతాయా.. ఖర్చులిస్తేనే జెండాలు మోస్తారా అనే చర్చ లేపాక్షి మండల వ్యాప్తంగా చర్చనీయంశంగా మారింది. హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి మండలంలో 12 గ్రామ పంచాయితీల్లో టీడీపీ, వైసీపి నాయకులు పెద్ద ఎత్తున ఉండటమే కాకుండా రాజకీయాల్లో కూడా పోటాపోటీగా నిలుస్తుంటారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం మండలంలోని ఇరువర్గాల నాయకులు మౌనంగా వుంటున్నారు. పోటాపోటీ ప్రచారాలు లేకపోవడంతో అభ్యర్థుల తీరుపై చర్చలు జరగ్గా స్థానిక ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు కింద స్థాయి నాయకులకు కనీసం ఖర్చులకు కూడా. ఇవ్వలేదనే సమాచారం. ప్రస్తుతం ప్రచారం చేయాలంటే బోజనం, నీరు, వాహన సౌకర్యం అంతకుమించి తదితర ఖర్చులు స్థానిక నాయకులు పెట్టుకోలేక ఇరుపార్టి నాయకులు చర్చలు సాగిస్తున్నారు. ప్రచారాలు ఎందుకులే ఎన్నికల ముందు ప్రజలకు తాయిళాలు అందిస్తే ఓట్లు వేస్తారనే ధీమాతో అభ్యర్థులు ఉన్నట్టు తెలుస్తోంది. గ్రామాల వారిగా స్థానికంగా వాడివేడిగా వుండాల్సిన రాజకీయం కాసులు లేకపోవడంతో కాలక్షేప రాజకీయంగా మిగిలి పోయింది. అధికారం వస్తే శాసించే మండల నాయకులు ఖర్చులకు భయపడి మౌనంగా వుంటే పార్టి జెండాలు మోసే కార్యకర్తలు ఎన్నికల వేళా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటుపై అవగాహన ఉన్న ప్రజలు ఎన్నికల్లో కాసులు ఇచ్చిన తిరిగి గెలిచాక మన వద్ద నుండి ఏదో విధంగా వసూలు చేస్తారని అభివృద్ధి చెబితే ఓటేద్దాం లేదంటే నచ్చిన వారికి ఓటేద్దామనే విధంగా పరిస్థితి మారింది.

చంద్రబాబు విజన్ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు

- యువనేత పల్లె క్రిష్ణ కిశోర్ రెడ్డి....

విశాలాంధ్ర-ఓడిచెరువు: రూరల్ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు విజన్ రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటును అందిస్తుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తనయుడు యువనేత పల్లె క్రిష్ణ కిశోర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుసుమ వారి పల్లి, దిగువపల్లి, మామిళ్లకుంట్లపల్లి, ఎం.కొత్తపల్లి, వడ్డివారి పల్లి గ్రామాల్లో సోమవారం ఎన్డీయే కూటమి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డికి మద్దతుగా పల్లె క్రిష్ణ కిశోర్ రెడ్డి ఇం టింటా ప్రచారం చేశారు. టీడీపీ మహిళలు పల్లె కృష్ణ కిశోర్ రెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతూ, పూల వర్షం కురిపించారు. టీడీపీ యువనేత పల్లె కృష్ణ కిషోర్‌రెడ్డి ఉత్సాహంగా పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. కృష్ణ కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ... వైసీపీ దుర్మార్గపు పాలనను ప్రజల్లో ఎండగట్టి జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపడంతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. చంద్రబాబు సారధ్యం లో రాష్ట్ర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత తో ఉన్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై దాడులు అధికమైనట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణచూసి ఓర్వలేని వైసీపీ నాయకులు అధికారం అడ్డుపెట్టుకొని, పోలీసుల సాయంతో టీడీపీ కార్యకర్తలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నా రని ఇది సరైంది కాదని హితవు పలికారు. రాష్ట్ర భవిష్యత్తు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళా అభివృద్ధి, రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వచ్చే ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీని అఖండ విజయంతో గెలిపించాలని ఘ ఓటర్లను కోరారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుస్తాయని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ సభ్యులు పిట్టా ఓబుళ రెడ్డి, ఎద్దుల ప్రమోద్ కుమార్‌రెడ్డి, కన్వీనర్ జయచంద్ర, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, కొత్త సుధాకర్ రెడ్డి, కంచి సురేష్, మాజీ డీలరు గంగిరెడ్డి, గంటా శ్రీనివాసులు, పీట్ల మనోహర్ పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని మరొక్కసారి ఆశీర్వదించండి

మంత్రి ఉషశ్రీ చరణ్

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని రాంపురం పంచాయతీలోని కొండంపల్లి, రాంపురం, మరవ పల్లి, హనుమపల్లి, చెర్లోపల్లి గ్రామాలలో సోమవారం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర ప్రసారం చేపట్టిన శిశు సంక్షేమ శాఖ మంత్రి పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి కె.వి ఉషశ్రీ చరణ్ ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీ ప్రతి ఒక్కరిని మరొక్కసారి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ ఏపీ వైఫ్ అన్ని రాష్ట్రాలు చూస్తున్నాయని నాడు నేడు పథకం ద్వారా పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం చదువుతోపాటు నాణ్యమైన భోజనం మంచి బట్టలు అందిస్తున్నారని సచివాలయ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు రైతులకు గ్రామస్థాయి పాలన అందిస్తున్నారని అలానే కాకుండా అమ్మ ఒడి మహిళలకు ఆసరా చేయూత జగనన్న తోడు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇన్ని సంక్షేమ ఫలాలు ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దూసుకుపోతూ మేనిఫెస్టో పెట్టిన పథకాలు 100 శాతం అమలు చేసిన ఘనత మన ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి ఉషశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ నాగమూర్తి, కన్వీనర్ బాబు మునిమడుగు, శ్రీనివాసులు, అంజినాయక్, పెద్ద ఆంజనేయులు, రాంపురం నారాయణ, చిన్న అంజి, గోవిందప్ప, శ్రీరామ్ రెడ్డి, ఆదినారాయణ, సుబ్బిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు. అలాగే పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డు, 15వ వార్డులో ప్రచారం నిర్వహించారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-గోరంట్ల : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోరంట్ల పట్టణం లోని బస్టాండ్ సర్కిల్లో చోటుచేసుకుంది. సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు.. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం బొత్సా పేట గ్రామానికి చెందిన మీసాల సత్యనారాయణ కుమారుడు మీసాల ఉపేంద్ర (21) కొంతకాలంగా పాలసముద్రం వద్ద గల ఎన్ఎల్ఎపి సంస్థలో గల ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నాడు, బస్టాండ్ సర్కిల్లోని చలపతి ఇంటిలో తన స్నేహితుడితో కలిసి అద్దెకు ఉంటున్నాడు. తెల్లవారుజామున బాత్రూంలో ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. ఎంతసేపటికి రాకపోవడంతో తన స్నేహితుడు బాత్రూంలోకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని వేలాడుతుండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ సబ్ కలెక్టర్ నియోజకవర్గ అబ్జర్వర్ అపూర్వ భారత్ సబ్ కలెక్టర్ కార్యాలయంలోసోమవారం ఓటు హక్కును వినియోగించుకోండి ఓటు హక్కును వినియోగించడం పౌరుల బాధ్యత అని కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డులో తన సంతకం ద్వారా మద్దతును తెలిపారు అలాగే ఎన్నికలకు మద్దతు తెలుపుతూ ఓటు వినియోగించుకోవడం పౌరుని బాధ్యత అని సెల్ఫీ తీసుకొని ఓటర్లకు తమ సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో తాహసిల్దార్ ఉదయ శంకర్ రాజు డిప్యూటీ తాసిల్దార్ గిరి పాల్గొన్నారు.

గిరిజన నాయకులు వైసీపీకి మద్దతు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ మండలం మంగాపురం గ్రామంలో సోమవారం టిటిడి బోర్డు మెంబర్ అశ్వత్థనాయక్ పాత్రికేయులతో మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు నా ఎస్సీ నా ఎస్టీ నా బీసీ నా మైనార్టీ సిద్ధాంతంతో మండల పరిధిలోని శెట్టిపల్లి తాండ, కొండపల్లి తండా, మంగాపురం తండా గ్రామాలలో విస్తృతంగా పర్యటించి గిరిజనులందరూ వైఎస్ జగన్మోహన్ రెడ్డికి బాసటగా నిలవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు ఎస్టీలకు తిరుమల తిరుపతి దేవస్థానంలో బోర్డ్ మెంబర్‌గా ఎస్టీలకు స్థానం కల్పించిన దాఖలాలు లేవని గిరిజనులను గుర్తించి టిటిడి బోర్డు నెంబర్ ఇవ్వడం,గిరిజనులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు గుర్తింపు ఇవ్వడం గర్వించదగ్గ విషయమని కావున ఈ విషయాలను గిరిజనులు తెలియజేయడానికి విస్తృతంగా తండాలలో పర్యటిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శివశంకర్ నాయక్, భాస్కర్‌నాయక్, సుధాకర్ నాయక్, రామచంద్రనాయక్, జ్యోతి శ్రీధర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర-రొళ్ల: మడకశిర నియోజకవర్గంలో అభివృద్ధి కావాలంటే తెదేపా అభ్యర్థి ఎంఎస్. రాజు సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారితో గెలిపించాలని టీడీపీ మండలాధ్యక్షులు దాసిరెడ్డి కోరారు.సోమవారం మండల పరిధిలోని కాకి గ్రామపంచాయతీలోని అప్పేపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉందని ముఖ్యంగా మహిళలు ఈ పథకాలు కావాలని చెబుతున్నారన్నారు. అలాగే ఐదేళ్ల వైసిపి పాలనలో ఇలాంటి అభివృద్ధి జరగలేదని ప్రజలు నుంచి వ్యక్తమ వుతొందన్నారు తాము కూడా ప్రజలకు చెబుతున్నది ఒక్కటేనని ఎంఎస్.రాజును ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు మంచిపాలన కొనసాగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల కార్యదర్శి జి.కె ఈరన్న ,మాజీ ఎంపీపీ క్రిష్టప్ప, నియోజలవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షరు బాల కృష్ణ టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి టి.డిపల్లి నాగేంద్రప్ప తదితర నాయుకులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి ఇనుప మంచాల వితరణ

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండలం రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమానికి అనంతపురం పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ జయకర్, భార్య స్నేహ దంపతులు రూ.55 వేల విలువ చేసే 17 గ్మార్నెజ్ మంచాలు వితరణ చేసి, ఆశ్రమంలోని వారికందరికీ అన్నదానం చేసినట్లు ఆశ్రమ పౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో క్రిష్,లీజు, బంధువులు పాల్గొన్నారు. అగాపే ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్, ఆశ్రమవాసులు ఆ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

యువత భవిష్యత్తు కోసం టీడీపీకి ఓటేద్దాం

తెలుగు యువత మండలాధ్యక్షుడు కావిడి ప్రవీణ్ కుమార్

ప్రచారం చేస్తున్న తెలుగుయువత నాయకులు

విశాలాంధ్ర-తనకల్లు: ఐదు సంవత్సరా లలో సంక్షేమం చేస్తున్నానంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరిచిందని అభివృద్ధి లేని సంక్షేమం మాకొద్దని తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ తెలిపారు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అందించే సత్తా ఉన్న ఏకైక నాయకుడు మన నారా చంద్రబాబు నాయుడు అని దానికి ఉదాహరణ హైదరాబాదును అభివృద్ధి పరచడమేనన్నారు ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోందని తెలుగుదేశం పార్టీ పునాది యువశక్తి అని అలాగే ఏ రంగంలో అయినా ఉజ్వల భవిష్యత్తు అందుకోవాలనుకునే యువతకు టిడిపి పాలన ముందుంటుందన్నారు. మండలంలో తెలుగు యువత ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాలతో పాటు, తెలుగు దేశం పార్టీ పేద ప్రజలకు చేసే సేవల గురించి వివరిస్తూ చంద్రబాబు నాయుడిని ముఖ్య మంత్రి చేసుకోవడానికి కంది కుంట వెంకటప్రసాద్‌ను ఎమ్మెల్యే గాను పార్థసారధిని ఎంపీగాను సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపింలచాలని ఓటర్లను కోరారు. తెలుగు యువత మండలాధ్యక్షుడు కావిడి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వస్తే నిరుద్యోగులకు మెగా డీఎస్సీతో పాటు, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి 3 వేల రూపాయలు, వాలంటరీలకు రూ.10 వేల వేతనం కల్పిస్తుందన్నారు. యువత భవితకు భరోసా ఇవ్వగలిగిన ఏకైక పార్టీగా తెలుగుదేశం పార్టీ గుర్తింపు తెచ్చుకుందన్నారు. యువ నాయకుడైన కదిరి నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కంది కుంట వెంకటప్రసాద్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఈసారి అసెంబ్లీకి పంపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యువకులు పులి మహేష్, మధుకర్ నాయుడు, ప్రశాంత్ నాయుడు, ఖాజా ఖాన్, కిషోర్ గౌడ్, రామచంద్ర, తోట కిషోర్, సానే రామాంజులురెడ్డి, సిద్దుగౌతమ్, వాల్మీకి వినోద్, అశోక్, రవీంద్రరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మురళి, శంకర్ నాయుడు ప్రసాద్ (మోటు) శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేసే టీడీపీని గెలిపిద్దాం....

- కందికుంట యశోదదేవి

విశాలాంధ్ర-కదిరి : అభివృద్ధితో పాటు సంక్షేమానికి బాటలు వేసే టీడీపీని గెలిపించాలని టీడీపీ, జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ సతీమణి కందికుంట యశోద దేవి పేర్కొన్నారు. సోమవారం ఆమె 34వ వార్డులో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే రైతుకు ప్రతి ఏటా 20 వేల రూపాయలు ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు,ప్రతి మహిళకు నెలకు 1500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు అందించడమే గాక రాష్ట్రంలోని మహిళలందరికీ ఎక్కడికి వెళ్లాలన్నా ఉచిత బస్సు ప్రయాణ సౌకరం కల్పిస్తుందని తెలిపారు. 2024లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడం తథ్యమన్నారు. అభివృద్ధి లేని రాష్ట్రానికి దిశా నిర్దేశం చేసి అభివృద్ధి పరిచే సత్తా ఉన్న నాయకుడు మన చంద్రబాబు నాయుడని ముఖ్యమంత్రిని చేసుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కుటాల లక్ష్మణ్, అనురాధ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-కొత్తచెరువు: వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ రాధా నాగరాజు, కాపునాడు జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ సూరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాదయాత్ర వాల్మీకి శంకర్, తెలిపారు. కొత్తచెరువులోనే బసవన్న కట్ట వీధి ముస్లింస్ కాలనీ మేదర వీధి లో ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటా తిరిగి వైసీపీ మేనిఫెస్టో అని కరపత్రాలను పంపిణీ చేశారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. కావున రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యేగా డి శ్రీధర్ రెడ్డిని, హిందూపురం ఎంపీగా బోయ శాంతమ్మను, ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండ్ ప్రెసిడెంట్ నాగభూషణ్, వైస్ సర్పంచ్ యుగేందర్, ఎంపీటీసీ రఫీ, ఆవుల లక్ష్మీదేవి ,సోమశేఖర్ రెడ్డి షాజహాన్, వడ్డే నారాయణ, అంగడి సత్తి, ఎల్లప్ప, పెయింటర్ కేశవ, కృష్ణమూర్తి, ప్రభావతమ్మ, బళ్లారి బాబు భాస్కర, వెంకటరాముడు పాల్గొన్నారు.

యువతదే ఉజ్వల భవిష్యత్తు..

- పల్లె సింధూర...

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రం, అమడగూరు పంచాయతీలోని ఏ కొత్తపల్లి, పుట్లవాండ్ల పల్లి, అమడగూరు గ్రామాలలో సోమవారం టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థికి ప్రతి గ్రామంలో మహిళలు హారతులు పట్టి పూల మాలలు వేసి డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలోని ప్రజలు మాకు త్రాగడానికి నీరు లేవని, గత ప్రభుత్వంలో ఇంటి స్థలాలు కానీ ఇల్లు కానీ ఇవ్వలేదని, చంద్రబాబు ఇస్తున్న పెన్షన్లను సైతం తీసేశారని, గతంలో వైసీపీకి ఓటు వేసి తప్పు చేసామని వారు ఆవేదన చెందారు. వారిని ఓదారుస్తూ పల్లె సింధూర మన ప్రభుత్వం రాగానే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఓటే మనందరి వజ్రాయుధం ఓటేనని, అవినీతి పరులను చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, అధికారంలోకి వస్తే అనేక పరిశ్రమలు ఉద్యోగాలు, ఉపాధి రంగంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం యువతకు చేసింది ఏమీ లేదని, తెలుగుదేశం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ప్రత్యక్షంగా పరోక్షంగా లబ్ధి పొందాయన్నారు. వైసీపీ ప్రభుత్వం రాకతో మరెన్నో పరిశ్రమలు రాకుండా పోతాయని గుర్తు చేశారు. ఐదేళ్లలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. కాబట్టే వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. అనంతరం సీతిరెడ్డి పల్లి కళాశాలలో వద్ద క్రికెట్ టోర్నమెంట్‌కు రిబ్బన్‌కట్ చేశారు. యువకులు మాట్లాడుతూ మాకు ఆట స్థలం లేదని, నీటి సౌకర్యం లేదని తెలపగా తప్పకుండా మీ సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎన్నికల ఇంచార్జి శ్యాంబాబు నాయుడు, వడ్డేర మండల అధ్యక్షుడు కిష్టప్ప, ఒంటరి ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ రామచంద్ర, బీజేపీ సీనియర్ నాయకులు ఐ.రాము, శ్రీనివాస్‌రెడ్డి కృష్ణారెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు బోనాల మాభు పాల్గొన్నారు.

డబ్బుకు అమ్ముడుపోయి కార్యకర్తలని నట్టేట ముంచిన ఈరన్న

విశాలాంధ్ర-మడకశిర : మడకశిర నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని కాదని మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్ కుమార్ కు తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేయాల్సిందిగా ఆ పార్టీ అధిష్టానం ఆదేశించింది. అప్పటినుండి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అభ్యర్థిని మారిస్తే తప్ప పని చేయనని భీష్మించుకుని కూర్చున్నారు. గుండుమల సహకారం లేకుంటే తెలుగుదేశం పార్టీ మడకశిరలో గెలవదనే సంకేతాలు పార్టీ అధిష్టానికి అందడంతో మరో ఆలోచన లేకుండా సునీల్ కుమార్ ను పక్కనపెట్టి ఎమ్మెస్ రాజుకు బి ఫామ్ అందించి టికెట్‌ను కేటాయించింది. అయితే ఈరన్న కుమారుడు సునీల్ కుమార్ ఇద్దరూ రెబల్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేయడంతో సర్వత్ర ఉత్కంఠ రేపారు. ఈరన్న అనుచరులు సైతం భారీ ఎత్తున తనకు అండగా నిలవడంతో నామినేషన్లో సైతం వేలాది మంది పాల్గొని టిడిపి పార్టీకి వణుకు పుట్టించారు. ఈరన్న అనుచరులు అందరూ రెబల్ అభ్యర్థి గానే పోటీ చేయాలని పట్టు బట్టి కూర్చున్నారు. మీ అందరి అభిప్రాయానికి అనుగుణంగానే నడుచుకుంటానని మాట ఇచ్చిన ఈరన్న సోమవారం తన నామినేషన్ ను విరమించుకున్నారు. ఈ సంఘటనతో ఈరన్న అనుచర వర్గం బగ్గున మండింది. సోమవారం పట్టణంలోని మెట్టు బండ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈరన్న అనుచరులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా నీ వెంట తిరిగి నందుకు మాకు తగిన బుద్ధి చెప్పావని మమ్మల్ని మోసం చేసిన పాపం నీకు ఊరికే పోదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం డబ్బు కోసమే మా ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టిన నువ్వు ఇకపై రాజకీయాలు మానుకోవాలని మండిపడ్డారు. జీవితంలో నిన్ను ఏ నాయకుడు గానీ కార్యకర్తగాని నమ్మరనే విషయాన్ని గ్రహించి రాజకీయాలకు స్వస్తి పలకాలని నీకు నువ్వే రాజకీయ సమాధి కట్టుకున్నావని ఈరన్న పై కార్యకర్తలు ధ్వజ మెత్తారు. మా భవిష్యత్ కార్యాచరణ మరో రెండు రోజుల్లో తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రెబల్ ఎంపీ అభ్యర్థి కే ఎన్ పల్లి సురేష్, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ,బజ్జప్ప,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రకాష్, రాజగోపాల్, కిష్టప్ప, ఈశ్వర్ పాల్గొన్నారు.

వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఎంఎల్ఏ అభ్యర్థి ఎంఎస్ రాజు ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేసారు. గుడిబండ మండలంలోని గుణేమోరుబాగిలు, మోరు బాగలు, ముత్తుకూరు, తాళ్ళకెర, సిసిగిరి, మందలపల్లి, కొం కల్లు, ఎస్.రాయాపురం గ్రామ పంచాయితీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ ఎంపి అభ్యర్థి బికె పార్థ సారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కావున ప్రజలందరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, టిఎన్టియుసి అధ్యక్షుడు బాలేపల్లి రాజు,జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్, క్లస్టర్ ఇంచార్జీలు భీమరాజు, లక్ష్మీనరసప్ప, యూనిట్ ఇంచార్జీలు జనార్ధన్, సర్పంచ్ నారాయణప్ప, మాజీ ఎంపిటిసిలు భోజరాజు క్రిష్టప్ప నజీర్, వెంకటేష్, శ్రీకాంత్,కొంకల్లు రామాంజి, వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా నాయకుల ముమ్మర ప్రచారం...

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణం లోని ప్రతి వీధిలోనూ ఇంటింటా తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. హిందూపూర్ పార్లమెంట్ ఉమ్మడి టీడీపీ లోకల్ అభ్యర్థి బీకే. పార్థసారధి పెనుగొండ నియోజక వర్గ ఉమ్మడి టిడిపి లోకల్ అభ్యర్థి సవిత ఆదేశాలతో గోరంట్ల టౌన్‌లో ప్రతీ వార్డు ఇంటింటా ప్రచారం ముమ్మరం చేస్తున్న లోకల్ మండల మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కవితమ్మ భర్త వెంకటేశ్వరరావుతో పాటు సోదరుడు శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, మాజీ ఎంపీటీసీ యువశేఖర్, బాలకృష్ణ చౌదరి తెలుగు దేశం పార్టీ మైనార్టీ సెల్ సహాయ కార్యదర్శి అబ్బుతుల్లా, మాజీ సర్పంచ్ నరేష్, నిమ్మల శ్రీధర్, వృషభ దేవుడు, జనసేన వెంకటేష్, సంతోష్ కుమార్, ఉత్తమ రెడ్డి పాల్గొన్నారు.